ఆంధ్ర-దోమలసభ

౧

యోగాభ్యాసం చేస్తూన్నవాడు ఒక స్థితిలో పశు పక్ష్యాదుల భాషలు తెలుసుకో గలుగుతాడట ! నేను ఎంత వద్దన్నా వినకుండా నాస్నేహితు డొకడు యోగాభ్యాసం మొదలు పెట్టాడు. తెల్లారకుండా ఒక గదిలో తలుపులు వేసుకొని కూర్చుని ఏవో ముగ్గులు వేస్తుండేవాడు. అవేమిటంటే ఆసనాలని నాతో రహస్యంగా చెప్పేవాడు. అంతే కాకుండా ఇంజనుగొట్టములో ఆవిరిలాగ చప్పుడుచేస్తూ గాలి లోపలికి ఎగపీల్చి బయటకు వదలిపెట్టుతూ ఉండేవాడు. అదేమిటంటే ప్రాణాయామం—ఎవరితోనూ చెప్పవద్దన్నాడు. క్రమక్రమంగా ఆపిచ్చిలో పడిపోయాడు. కొన్ని నెల్లయ్యేసరికి ఏవేవో కొత్తశక్తులు తన కబ్బేయని చెప్పాడు. అందులో ఒకశక్తి పశువుల, పక్షుల, కీటకముల భావాలు వాటిచేష్టల ద్వారా శబ్దములద్వారా ఇతరవిధములుగాను గుర్తించడం.

అతగాడు చేప్పే మాటలు యథార్థమో కాదో అని అప్పుడప్పుడు ఒక్కొక్క మృగాన్నుద్దేశించి దానిభావము చెప్పమనేవాడిని. ఏదో చెప్పుతూఉండేవాడు. అయితే అతడు చెప్పింది నిజమో కాదో నిర్ణయించడం ఎలాగ?

గోదావరి ఒడ్డున గడ్డికి ప్రత్యామ్నాయము కాగితాలు తింటూన్న ఒకగోవును చూపి ఇది ఏమనుకొంటోంది చెప్ప

మంటే అతడు అక్కడ నిలబడి దానికేసి నిదానించి చూచి కళ్లుమూసుకొని చెప్పేవాడు. "ఇది—ఈగోవు—ఈగోవు ప్రస్తుత సమయాన్ని మనదేశములో ధర్మము క్షీణించిందని విచారిస్తోంది. ఈ మానవులు తను కాగితాలు తినడంచూచి గోవుల కుండదగ్గ హక్కులమాట అటుండగా అధమపక్షం కడుపునిండా గడ్డేనా వేస్తారేమో నని ఆలోచిస్తోంది."

ఈమాటలు విన్న నేను ఏమనుకోవాలి ?

ఒకనాడు ఒక ఆంబోతు తానే పట్టణ మేలుతూన్నట్లు చూస్తూ రోడ్డు కడ్డంగా నిలబడింది. మనుష్యులూ బళ్లూ తప్పుకుపోతున్నారు కాని దాన్ని ఎవరూ పక్కకు తోలడం లేదు భయంచేత.

దాని చిత్తవృత్తి ఎటువంటిదో తెలుసుకోవా లని అడిగాను మా స్నేహితుణ్ణి. అతడు చెప్పుతున్నాడు—"ఈ మనుష్యులకు బుద్ధి లేదు. లొంగితే బళ్లకు కట్టుకు తిప్పుతారు. ఎదురుకొంటే దూరంగా తొలిగిపోతారు........,............ బోలెడంత గందరగోళంచేసి, పసుపు రాసి, కుంభం పెట్టి, ఊరేగించి, పూజించి, అచ్చుపోసి వదలిపెడతారు. మర్నాడు దానికి తిండి దొరికిందా, లేదా అనే సంగతైనా ఆలోచించరు....................చస్తే రెండెడ్ల బండిలో ముస్తాబుచేసి పడుకోబెట్టి ఊరేగిస్తారు. బదికున్నప్పుడు పట్టెడు గడ్డిపోచలైనా వెయ్యరు....ఈ మానవుల్ని ఏం చేసినా పాపం లేదు."

ఈ విధంగా నా స్నేహితుడు జంతు హృదయాన్ని వెల్లడి చేసేవాడు. అతడిమాటలను బట్టి చూస్తే వాటికి మనుష్యుల పట్ల సద్భావ మున్నట్లు తోచదు.

మనుష్యులు తమ కుపకారము చెయ్యడం లేదని వారిని నిందించడమే కాకుండా అకారణంగా మానవుల ఆచార వ్యవహారాలను గురించి కూడా అవి ప్రసంగించుకోవడమూ నిందించడమూ కూడా కద్దు.

ఊరివెలపల చిట్టడవిలోకి మే మిద్దరమూ షికారుగా వెళ్లినప్పుడు అతడు ఒకపక్షి దంపతుల సంభాషణ ఈవిధంగా చెప్పాడు.

"చూడు చూడు, ఇద్దరు ద్విపాత్తులు అలా వెడుతున్నారు.

"వాళ్లఒళ్లు అలాగ వేళ్లాడిపోతోందేం పాపం?"

"ఒళ్లు కాదు వేళ్లాడుతూంట—అవి వాళ్లు తొడుక్కునే బట్టలు."

"ఎందుకు పాపం వాళ్లవి తొడుక్కోవడం — వాళ్లకి ఒంటిమీద చర్మం గాని వెంట్రుకలు గాని లేవూ ?"

"ఉన్నాయి, ఉన్నా ఎందుకో అవి తొడుక్కుంటారు."

"పాపం మనకు భగవంతుడు రెక్కలూ వెంట్రుకలూ ఇచ్చినట్లు వాళ్ల కివ్వలేనట్లుంది. నిజంగా భగవంతుడు పక్షపాతం చేస్తాడా?"

జంతువులలో ఉత్కృష్ట జంతువులూ నీచ జంతువులూ అంటూ లేవూ? ఉత్కృష్ట జంతువుల కుండే సదుపాయాలు నీచజంతువుల కుంటాయా? భగవంతుడి దయకు పాత్రమైన వాళ్లు ఉత్కృష్టజంతువులై పుడతారు. పాపం చేసుకొన్న వాళ్లకి ఏ నరజన్మమో, ఏ సర్పజన్మమో వస్తుంది."

"అవును పాపం—చూడు తలమీద బుట్టలు బోర్లించుకొన్నారు. మెడకు గుడ్డపేలికలు చుట్టబెట్టుకొన్నారు. కళ్లకు

గంతలు కట్టుకొన్నారు, కాళ్లకు డెక్కలు తగిలించుకొన్నారు........"

"తోడిజంతువులు నవ్వుతారనేనా లేదు వీళ్లకి—"

"వాళ్లదగ్గరగా వెళ్లకూడదు. వాళ్లకళ్లు మంచివికావు...."

ఈవిధంగా సంభాషణ వెడుతోంది. నా స్నేహితుణ్ణి ఆపి అన్నానుగదా, "పూర్వకాలాల్లో పక్షిదంపతులు రాచకొమార్తెలనుగురించీ రాచకొమాళ్లనుగురించీ మాట్లాడుకొంటూ ఉండేవిట—ఈకాలంలో ఈవిధంగా మారాయేమి? మళ్లీ జాగ్రత్తగా విను—మన యువరాజుగారి పెళ్లినిగురించి కాని మన మంత్రిగారి కుమారుడి పెళ్లినిగురించి గాని మాట్లాడుతాయేమో."

మా స్నేహితుడు వినాలని మళ్లీ మనస్సు నేకాగ్రము చేసుకొంటూండగా అవి ఎగిరిపోయాయి.

ఈవిధంగానే తమకు బలిభుక్కులని పేరుపెట్టిన్నీ మనుష్యులు తమకు బలులు వేయడం లేదని కాకులు అడ్డమైన తిట్లూ తిడుతూన్నట్లు ఒకమాటు నా స్నేహితుడు చెప్పాడు.

వినోదంగా కొంతకాలం ఈమాదిరిగా కాలక్షేపం చేశాము. ఒకనాటిసాయంకాలం నా స్నేహితుడు మా యింటికి పరుగెత్తుకు వచ్చి—"లే, లే, వెడదాం, రా, చప్పున—కండువా వేసుకో."

"ఏమంత తొందర" అన్నాను.

"టైము లేదు. రావాలి, రావాలి చప్పున" అన్నాడు.

"ఏమిటి సంగతి?"

"దోమల సభ."

"అంటే?"

"నీకు మతిగానే పోయిందా ఏమిటి—ఇప్పుడు దోమలు సభ చేసుకొంటున్నాయి. రా, కాగితాలు, కలం తీసుకురా, వ్రాసుకొందువుగాని—"

"ఎక్కడ ఈ సభ?"

"దానవాయిగుంటలో."

"అక్కడ దోమ లుండవే. ఆరోగ్యకరంగా ఉండే తావుల్లో దోమలు సభ చేస్తవా?"

"అదే తమాషా—వాటికీ ఆరోగ్యకరంగా ఉన్న స్థలాలు కావాలిట—"

"ఈసంగతి నీ కెలా తెలిసింది?"

"రెండు దోమలు నా చెవిదగ్గిర చెప్పుకొంటూంటే విన్నాను."

ఇద్దరమూ బయల్దేరి వెళ్లాము దోమలసభకి.

౨

కుంటకు సమీపంలో ఒకదోమలదండు ఎగురుతున్నది. చుట్టూ చెట్లు. ఆ ఎగరడంలో ఒకమోస్తరు శబ్దము పుడుతోంది. కుంటసమీపానికి వచ్చేటప్పటికి నా స్నేహితుడు "అయిపోతోంది, సభ, అయిపోథోంది" అన్నాడు.

"దోమ లింకా ఎగురుతూనే ఉన్నాయి" అన్నాను.

"ఎగురుతూనే అవి సభచేసుకోవడం" అన్నాడు. అని అక్కడ ఒకబండమీద కూర్చున్నాడు. కళ్లుమూసుకొన్నాడు. వింటూన్నట్లు అభినయిస్తూ "వ్రాసుకో" అన్నాడు.

అతడు చెప్పగా నేను వ్రాసింది ఇదిగో. ఇందులో ఏమీ మార్పులు చెయ్యలేదు. చెప్పింది చెప్పినట్లు వ్రాశాను. ఇందలి నిజానిజాలు బుద్ధిమంతులే తేల్చుకోవాలి.

"సోదర సోదరీ మణులారా — పవిత్రమైన గౌతమీ తీరాన్న జన్మించిన మనము తత్ప్రాంతములలోనే సభ చేసుకోక ఈ కుంటవద్ద సభ చేసుకోవడం మీకు వింతగా తోచవచ్చు. మనలను తరతరములనుండీ పోషించిన గౌతమి నేడు మన ఉదాసీనతకు కారణ మయిందని మనము విచారించవలసి ఉన్నది. కాని యీ మార్పుకు బాధ్యులము మనము కాము. పవిత్రమైన గోదావరిని కలుషితము చేస్తున్నది మానవులు. తత్ఫలము ననుభవిస్తున్నది మనము. మానవ రక్తమే ప్రధానాహారముగా గల మన మాప్రాంతములందలి మానవరక్తమును గ్రహించడమువల్ల రుజాపీడితుల మౌతున్నాము. ఆరోగ్యము చెడుతున్నది. అయితే దేశాంతరము పోరాదా అనే ప్రశ్న పుట్టవచ్చును.

"మన పూర్వులు సంపాదించిన ఈ క్షేత్రమును మనము నేడు కాదని విడిచి వెళ్లడము వివేకముకాదు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్న పాతమాట సభ్యులకు క్రొత్తమాట కాదు. ఏ మహాక్షేత్రమును రాజరాజు, రెడ్డిప్రభువులు, నవాబులు పాలించి మన వంశమును పోషించారో, ఏ మహారాజ్యము చిరకాలమునుండియు ఆంధ్రత్వమునకు నిలయమై యున్నదో, ఏ పవిత్రభూమి శ్రీనాథాది మహాకవుల వాణి కాటపట్టయినదో అట్టి రాజమహేంద్రవరమును మన మెన్నటికైన విడిచిపోగలమా? ఒక్కమాట మరవవద్దని

సభ్యులను నేను మరీమరీ వేడుకొంటున్నాను. మన పూర్వీకులను పోషించినది ఆంధ్రసామ్రాట్టయిన రాజరాజురక్తము. మన వంశమునకు ఆదిభిక్ష పెట్టింది ఆంధ్రకవితాపితయైన నన్నయ్యరుధిరము. మన కులములకు ప్రాపుగా నిలిచినది కవిసార్వభౌముడైన శ్రీనాథుని నెత్తురు. నానావిధ భక్ష్య భోజ్యముల ననుభవించిన మహారాజుల, మహావీరుల, మహాకవుల, గాయకగ్రామణుల, పతివ్రతాతిలకముల రక్తమే—వారి ఆంధ్రరక్తమే నేడు మన నాళములలో ప్రవహించుచున్నది. ఈమాటలు తలుచుకొన్న ఏ మశకశిఖామణి రక్తనాళములు ఉబుకవు, ఉడుకెత్తవు? మరవకండి, సోదరసోదరీమణులారా, మరవకండి, మశకశేఖరులారా మరవకండి—మన మాంధ్రుల మన్నమాట మరవకండి. ఆంధ్రరక్తము మన నాళములలో ప్రవహించుచున్న దన్నమాట మరవకండి. ఆనాడు ఆంధ్రశత్రువుల రక్తము ఆంధ్రవీరుల కరవాలములతోపాటు త్రాగినది మన తొండములే. ఉత్కళరక్తమును చవిచూచితిమి. యవనరక్తమును త్రాగితిమి. ఆంగ్లరుధిరమును రుచిచూచితిమి. అరవరక్తమును పానమొనరించితిమి. వలందులరక్త మెట్టి రుచి కలదో గ్రహించితిమి. ఆంధ్ర సామ్రాజ్యస్థాపనకు, తద్వ్యాప్తికి, స్థిరత్వమునకు మనమున్నా కారణ మన్నమాట మరవకండి. ఆంధ్రతటాకములు మన కాటపట్టులు. ఆంధ్రగిరులు మనకు విహారసీమలు. ఆంధ్రులు మన భోజనంబులు. వంశపారంపర్యముగా వస్తూఉన్న ఇట్టి హక్కులను వదలి స్థానభ్రష్టుల మైపోవుటకు మీరు ఇష్ట పడుదురా? ఆంధ్ర-దోమలారా! ఒక విన్నపము. భగవదను

గ్రహామువల్ల మన వంశము నాడునాటికి వృద్ధిచెందుచున్నది. చల్లనిరాజులు మన దేశము పాలిస్తున్నారు. మనపట్ల గౌరవాభిమానములుగల మన ఆంధ్రమానవ సోదరులు మన పట్టణమునకు పాలనకర్తలై ఉన్నారు. మన వంశాభివృద్ధికి గారణభూతులైన వారిపట్ల మనము కృతజ్ఞులమై ఉండవలెను. కిందటి జనాభా లెక్కలతో పోల్చి చూడగా నేడు మన జనసంఖ్య నూటికి వెయ్యిరెట్లు పెరిగినట్లు తేలుతున్నది. ఈవృద్ధికి మనము సంతోషించవలసినదే కాని ఒక ప్రమాదము మాత్రము సంభవించుచున్నది. మన జనసంఖ్య యింతగా పెరగడము వల్ల మనకు తగినంత ఆహారము దొరకడము లేదు. అంతే కాకుండా ఈకాలపు మానవరక్తము తగినంత ఆరోగ్యకరముగా ఉండకపోవడము ఒక కారణం. దురాచారములకు లోనైన నేటి మానవులు తమ రక్తము మనకు సరిపడడము లేదనిన్నీ రోగకారణ మగుచున్నదన్నినీ గ్రహిస్తే బాగుండును. పురపాలకులీ విషయము గ్రహింతురుగాక. ఇక మనకాహారము సరిపోకపోవడానికి కారణ మేమై ఉంటుందని శాస్త్రజ్ఞు లాలోచించగా తేలిన విషయం ఏమంటే——మానవుల జనసంఖ్య తగ్గుచున్నదట. అందుకు కారణము వారు సంతాననిరోధమును కొన్ని ఉపకరణములద్వారా చేసుకొంటున్నారట. ఈవిధముగా వారి జనసంఖ్య తగ్గి మన జనసంఖ్య పెరుగుతూ ఉన్నట్లయితే కొంతకాలానికి మనకు కూడు దొరకదేమో ననే భయము కలుగుతున్నది. కాబట్టి పెద్దల అనుమతిని నేను యువతీయువకులకు ఒక సలహా ఇస్తున్నాను. మానవుల మార్గమును మనమున్నూ అవలంబించి సంతాన

నిరోధమునకు ప్రయత్నిస్తే బాగుంటుందేమో ఆలోచించుండి. ('కూడదు, కూడదు' అని కేకలు.) తరువాత తమ చిత్తము.

"పైని నేను చెప్పిన వాక్యములవల్ల మనము మానవులపట్ల ఎంత అభిమానము వహించియున్నామో అందరికీ విదితమే. ఎంతటి ఆంధ్రాభిమానులమో సుగమ్యమే. ఇట్టి అభిమానపూరితులమైన మనయెడల మానవులు కృతజ్ఞులై ఉండవలెను గదా! మనలను సోదర సోదరీ భావముతో చూచుకోవలెను గదా! ఆంధ్రజనని గర్భోద్భవులమైన మనమున్నూ మానవులున్నూ ఏకోదరులవలె మెలగవలెను గదా. కాని అట్లు జరుగుచున్నదా? లేదు. ఇందు కెవరు కారణం? మన మెంతమాత్రమూ కాదని మన యంతరాత్మ మనకు బోధించుచున్నది. మానవులపై ఆధారపడి బ్రదుకవలసిన మన మెన్నడైన మానవులయెడ కృతఘ్నభావము వహించి ఉండగలమా? లేము. కాబట్టి యిట్టి స్థితికి కారణభూతులైన మానవుల నేమనవలెను? వారు కృతఘ్నులు కారా? అవివేకులు గారా? వారిని పోషించే ఆంధ్రగౌతమీనది మనలను పోషించుచున్నది గదా! వారిపై ప్రసరించే ఆంధ్ర వాయువులు మనపైనిన్నీ ప్రసరిస్తున్నవి కదా! వారి అస్థికల గర్భస్థము చేసుకొనుచున్న ఆంధ్రభూమి మన కళేబరములను కూడ గ్రహిస్తున్నది కదా? వారికి చాందినీయైన ఆంధ్రాకాశమే గదా మనకున్నూ మేలుకట్టై ఉన్నది? వారిపై తన కిరణములు ప్రసరించు ఆంధ్రసూర్యుడే గదా మనలనుకూడ

తనకిరణములలో ముంచుతున్నాడు! వారి రాజులే గదా మన రాజులున్నూ; వారి మహాకవులే గదా మన మహాకవులున్నూ; వారి కళాప్రవీణులేగదా మన కళాప్రవీణులున్నూ!

"ఈ సంగతి మానవులు గ్రహించారా? లేదు. సరి గదా మనలను వారి శత్రు కోటిలో చేర్చి అంతరింపజేయడమునకు ప్రయత్నిస్తున్నారు. ('సిగ్గు, సిగ్గు' అని కేకలు.) మన వలన వారికి క్రొత్తజబ్బులు పుట్టుతున్నవట—మలేరియాకు మనమే కారణమట; బోదకాళ్లకు మనమే కారణమట. ఇంకా ఏమేమో జబ్బులకు మనమే కారణమట—రాజరాజుకాలములో ఎన్నడైన ఇట్టిమాట పుట్టినదా? శ్రీనాథు డెన్నడైన యిట్టి యసత్యముల వక్కాణించియున్నాడా? పోతనమహానుభావు డెన్నడైన యిట్టి అవాచ్యముల పల్కి యున్నాడా? కృష్ణదేవరాయలనాడైన యిట్టి కింవదంతి పుట్టినదా? విన్నారా సోదరసోదరీమణులారా! నా అనుంగు ఆంధ్ర-దోమలారా! మానవులు మనపై పెద్దపెద్ద పుస్తకములు వ్రాసినారు! మన చిత్తరువులను అచ్చొత్తినారు! మనలను చంపు ఉపాయములను కనిపెట్టి ప్రచారము చేస్తున్నారు! ఇట్టి సందర్భములలో మనము చేతులు కట్టుకొని రెక్కలు ముడుచుకొని కూర్చొనవలసినదేనా? చేతగానివాళ్ల మనిపించుకోవలసినదేనా? ఆంధ్రరక్తము మీ నాళములలో ప్రవహించడములేదా! గతించిన ఆంధ్రవీరుల ప్రతాపము మీ స్మృతికి తగలడములేదా! మానవరక్తపానము మన జన్మహక్కు గాదా? భగవంతుని ఉద్దేశమేమి? మనల నెందుకు పుట్టిస్త? మొదట మానవులను పుట్టించి వారి రక్తము త్రాగి బ్రదకమని భగ

వంతుడు మనలను తరువాత పుట్టించియున్నాడు గదా ? ఇట్టి జన్మ హక్కును మనము వదలుకోగలమా ? భగవదాదేశమునకు వ్యతిరేకముగా నడచుకోగలమా? స్వామిద్రోహమున కొడి గట్టగలమా ? దేశద్రోహము చేయగలమా ?

"ఆప్తులారా ! ఈసందర్భమున మీ కోసంగతి జ్ఞాపకము చేస్తున్నాను. మన మూలపురుషులు పూర్వము అడవులలో సంచరించేవారు. తృణకాష్ఠజలసమృద్ధిగల ఆస్థలములలో వారు సుఖముగా దైవచింతలలో మునిగి ఉంటూండగా ఈ మానవులే వారిని పట్టణవాసమునకు రమ్మని ఆహ్వానము చేశారు ! అమాయకులైన మన పూర్వులు వారిమాటలు మన్నించి పట్టణములలో కాపుర మేర్పాటు చేసుకొన్నారు. ఇప్పుడు, యిన్నియుగములు గడచినతర్వాత ఈ మానవులు మనలను చంపుటకు—హత్య చేయుటకు ప్రయత్నిస్తున్నారు. చూచారా ఎంత కృతఘ్నులో ?

"వాదముకొరకు వారికి మనవల్ల జబ్బులు వస్తున్నవనే సంగతి ఒప్పుకొందాము. వారిలో కొందరిమరణమునకు మనమే కారణ మన్నమాట అంగీకరింతాము. అయితే ఆతప్పుకు ఇట్టిశిక్షలా విధించడం ? మన వంశక్షయము చేయడమునకు మానవుడు పూనుకొంటాడా ? మనలను ఆబాలవృద్ధము అంతరింపజేస్తాడా ? ఇది న్యాయమేనా? ఈ మానవుడు మనల నెంతటి చేతగానివారిక్రింద కట్టివేసినాడు? మనలో పౌర్యము చచ్చినదనుకొంటున్నాడు కాబోలు! మన పరాక్రమ మంతరించిం దనుకొంటున్నాడు కాబోలు ! మనలోఆంధ్రత్వముఇంకిపోయిం దనుకొంటున్నాడుకాబోలు!

"కడుపుకక్కుర్తికి మనము మానవరక్తము త్రాగుతున్నామన్నమాట మరవకండి. అది భగవదుద్దిష్టము కాకపోతే మన కీటుచ్ఛరక్తము కావలసివచ్చునా? ఈ మానవులేనా మహారక్తముతో నిండినవారు? ఎందరులేరు. కాని మనము భగవంతునిఉద్దేశమునకు భిన్నముగా నడుచుకోలేము.

"ఇట్టి చిన్నతప్పుకు——నిజముగా తప్పు కాదు, మన జన్మహక్కు——మనలను మారణహోమము చేయుదలచాడే మానవుడు! ఈ మానవుడిని ఏమి చేయవలసింది చూడండి అతడు చేసే తప్పులకు? నిష్కారణముగా ఏ కపటమూ ఎరుగని తియ్యటి పక్షులను అతడు ఇష్టము వచ్చినట్లు చంపుతున్నాడే! దీని కేమిశిక్ష? అడవులలో సంచరిస్తూ తమ బ్రదుకు తాము బ్రదికే అనపరాధులైన మృగములను వధిస్తున్నాడే! దీని కేమిశిక్ష? తనపిల్లలతోపాటు తాను సాకి, పిమ్మట పక్షులను, మేకలను, గొర్రెలను పీకలు కోసి తింటున్నాడే! దీని కేమిశిక్ష? భగవంతునిసృష్టికి కళంకప్రాయుడై ఉన్నాడే! భగవంతుని శాసనములను బ్రద్దలు కొడుతున్నాడే! దీసి కేమిశిక్ష? భగవంతుడు లేడూ? న్యాయాన్యాయ పరిపాలనము చెయ్యడూ?

"కాని సోదర సోదరీమణులారా! ఒక్కవిషయము మనవి చేస్తున్నాను. అది గుడ్డిలో మెల్ల. మనపై కత్తికట్టి మనలను సంహరించవలెనని పూనుకొన్న మానవుడు పుస్తకములు వ్రాయడముతోనూ, మన బొమ్మలు అచ్చొత్తించి ప్రదర్శించడముతోనూ, మనలను చంపే ఔషధములట—వాటిని కనిపెట్టడముతోనూ తృప్తిజెంది ఊరుకొన్నాడు. ఇది

మనము సంతోషించదగ్గ విషయం. ఇందుకు మనము మానవులయెడ కించిత్తు కృతజ్ఞులమై ఉండవలెను. మానవు డెంత వాక్శూరుడో అంత కార్యశూరుడూ ఖడ్గశూరుడూ అయి ఉన్నట్లయితే మనకు నిలవ నీడ లేకుండా ఉండేది. కాని మన అదృష్టమువల్లను భగవదనుగ్రహమువల్లను అత డట్టివాడు కాడు. అందువల్ల మన కంతగా ప్రమాదము లేదు. ఆలోచించగా నాకు తోచినవిషయం ఏమిటంటే—ఈ మానవుడు బదుకుతెరువు కోసమని ఈపుస్తకాలు రాసుకొంటున్నాడే కాని నిజముగా మనపై ద్వేషభావము కలిగి కాదు! చూడండి ఎంతమంది మనపేరు చెప్పుకు బతుకుతున్నారో! పుస్తకాలు రాసేవాళ్లు, బొమ్మలు చెక్కేవాళ్లు, అచ్చువేసేవాళ్లు, సినిమాలవాళ్లు, మాజిక్ లాంతర్లవాళ్లు, ఆసుపత్రులవాళ్లు, ఆరోగ్యశాఖవాళ్లు, ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు! ఇంతమందికి మనము జీవనాధారము కల్పిస్తున్నందుకు మనము గర్వపడవలెను; మానవులు మనయెడల కృతజ్ఞత చూపవలెను.

"పులిమీద పుట్ర అన్నట్లు ఈమధ్య ఆరోగ్యవారములంటూ లేవనెత్తి ఈమానవులు మనలను నిందించడం మొదలుపెట్టారు. మన వంశనిర్మూలనము లక్ష్యముగా పెట్టుకొన్నట్లు ఉపన్యసించారు. ఇందువల్ల మనకేమి ప్రమాదము సంభవిస్తుందో అని చాలాభయపడ్డాము. కాని క్రియకు వచ్చేసరికి ఆరోగ్యవారోత్సవాలన్నీ ఉపన్యాసములతో అంతరించాయి. విందులతో సమాప్తమయ్యాయి. ఇట్టి ఆరోగ్యవారోత్సవాలలో మనమున్నా హృదయ పూర్వకముగా

వారికి సాయపడి నిర్విఘ్నముగా అవి జరిగేటట్లు ముందు ముందు చేయవలెను. ఇట్టి ఆరోగ్యవారములు నిరంతరమూ జగపగలందులకై ఈసభతరఫున మానవులను నేను ప్రార్థిస్తున్నాను. అరవ ఉద్యోగస్థులు వచ్చి ఆరోగ్యవార సందర్భమున మనలను పారదోలవలెనని ఉపన్యాసము లిస్తూన్నట్లు తెలియుచున్నది. అరవవారి ఉపన్యాసాలకు బెదిరి పారిపోయే దుస్థితి యింకా ఆంధ్ర-దోమలకు పట్టలేదని మనవి చేసుకొంటున్నాను.

"సోదర సోదరీమణులారా! ఒక ముఖ్యవిషయమును గురించి నేను మీకు యింకను మనవిచేయవలసి ఉన్నది. మనము చిరకాలమునుండి పట్టణములో, అనగా పాతఊళ్లో, కాపుర మున్నాము. కాని మానవజన సమ్మర్దముచేతనూ ఆరోగ్యకరమైన మానవరక్తము మనకు దొరకనందువల్లనూ మనలో కొందరము ముఖ్యముగా ఆరోగ్యముకొరకై ఇన్నీసుపేట వలసపోయినాము. అక్కడకూడ పరిస్థితులు చెడినవి. అనారోగ్యము హెచ్చుతున్నది. వంశక్షేమము ప్రధానము కాబట్టి మనము — అధమపక్షము కొందరమైనను వేరొకచోటికి వలసపోవలసిన అవసరము గోచరించుచున్నది. ఆర్యాపురమూ, వీరభద్రపురమూ, మన మిప్పుడు సభచేసిన దానవాయిగుంటా వాసయోగ్యములని వింటున్నాను. తీరా ఆరోగ్యము చెడ్డతరవాత చేసేదేమిన్నీ లేదు. కాబట్టి ఇప్పుడే జాగ్రత్తపడడము మంచిది. 'శరీర మాద్యం ఖలు ధర్మసాధన' మ్మని గదా పెద్దలు చెబుతారు..................

....

అరుగో, అరుగో, మానవులు; చుట్టుకోండి, వాలండి, పొడవండి, తాగండి రక్తం..........."

నాస్నేహితుడు తటాలున లేచి "రా, రా, పారి పోదాం రా! మన్ని చూచాయి ఈ దోమలు. ఇక్కడ నిలిస్తే బతకనివ్వవు. రా, రా" అంటూ నన్ను లాక్కుపోయాడు. ఈలోపుగానే వందలాది దోమలు మామీద పడి చెడకుట్టాయి. బతుకు జీవుడా అంటూ ఏలాగైతే నేమి యింటిలో వచ్చి పడ్డాము.

నాస్నేహితుడు ఎవరో తెలుసుకోవాలని పాఠకులు పరిశోధనలు చెయ్యవచ్చు. అతగాడిపేరు చెప్పడానికి వీలు లేదు. కాని అత డింకా యోగాభ్యసం చేస్తూనే ఉన్నాడు. జంతుహృదయాలు తెలుసుకొంటూ ఉన్నాడు. అత డిప్పుడు నెల్లూరులో ఉన్నాడు. సాయంకాలాల్లో పెన్నఒడ్డున షికారు చేస్తూఉంటాడు. చేపల సంభాషణ తెలుసుకోడానికి ప్రయత్నిస్తూన్నట్లు మొన్ననే ఉత్తరం వ్రాశాడు. పర్యవసానం ఇంకా తెలియలేదు. ఇప్పటి కింతటితో సరి.

తాజాకలం — చివరకు దోమలసభ ఏమైనదో, అవి ఎట్టి తీర్మానాలు చేసుకొన్నాయో తెలియదు. కాని దేశములో దోమలబాధ మాత్రం ఎక్కువైనది.

1935